# నూతన దంపతుల ఆత్మహత్య

- ఆరునెలల కిందట ప్రేమవివాహం

బల్మూరు, జూన్ 9 : నూతన దంపతులు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బల్మూరు మండలం జినుకుంటలో చోటుచేసుకున్నది. ఏఎస్సై రేణయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహేశ్(21), భానుమతి(18) ప్రేమించుకొని ఆరు నెలల కిందట వివాహం చేసుకున్నారు. వీరి పెండ్లికి ఇరు కుటుంబాలు ఒప్పుకోలేదు. ఈక్రమంలో భానుమతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మహేశ్ కొంతకాలం జైలుకు వెళ్లి వచ్చాడు. ఈక్రమంలో శనివారం రాత్రి ఇంట్లో గొడవపడిన దంపతులిద్దరూ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. కాగా గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


మహేశ్, భానుమతి (ఫైల్)

# 'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో 117వ ర్యాంక్

- నల్లమల విద్యార్థి ప్రజిత్ ప్రతిభ
- అరవింద్‌కు ఎస్టీ కేటగిరీలో 33వ ర్యాంక్

అచ్చంపేట/అచ్చంపేట టౌన్, జూన్ 9 : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో అచ్చంపేటకు చెందిన శివ్వా రామ్‌నాగ ప్రజిత్, అరవింద్‌నాయక్ ప్రతిభ కనబర్చారు. ప్రజిత్ ఆలిండియా జనరల్ కేటగిరీలో 117వ ర్యాంక్ సాధించగా అరవింద్ నాయక్ ఎస్టీ కేటగిరీలో 33వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ప్రజిత్ తల్లిదండ్రులు శివ్వా రాధిక, సత్యనారాయణ మాట్లాడుతూ తమ కుమారుడు మాదాపూర్‌లో ఇంటర్ పూర్తి చేసి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తమ ఫలితం సాధించాడన్నారు. పాండునాయక్ బిజినేపల్లి గురుకుల పాఠశాలలో పనిచేస్తుండగా.. అతడి కుమారుడు జేఈఈ ఫలితాల్లో ర్యాంక్ సాధించి ఐఐటీలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా అరవింద్‌కు తల్లిదండ్రులు స్వీట్లు తినిపించారు. అరవింద్ 1 నుంచి 7వ తరగతి వరకు అచ్చంపేట, టెన్త్, ఇంటర్ ఆదిబట్లలోని చైతన్య జూనియర్ కళాశాలలో చదివాడు. ఐఏఎస్ సాధించాలనేది తన లక్ష్యమని అరవింద్‌నాయక్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు రాజకీయ నాయకులు, పలు సంఘాలు, ఆర్య వైశ్య పెద్దలు ప్రజిత్‌తోపాటు అతడి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.


మహబూబ్‌నగర్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

# ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు, ఎస్పీలు
- ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించని అధికారులు


నాగర్‌కర్నూల్/వనపర్తి టౌన్/గద్వాల/పాలమూరు, జూన్ 9: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. కందనూలు జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లు ఏర్పాటు చేయగా 5,221మందికి గానూ 4,184 మంది పరీక్ష రాశారు. అందులో 2,657 మంది పురుషులు కాగా, 1527 మంది మహిళా అభ్యర్థులున్నారు. గైర్హాజరైన వారిలో 621మంది పురుషులు కాగా, 416 మంది మహిళా అభ్యర్థులున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నాగర్‌కర్నూల్ బాలుర ఉన్నత పాఠశాల, పాలెంలోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కాగా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 14 సెంటర్లు, పాలెంలోని 2 సెంటర్లు, తెలకపల్లిలోని 2 కేంద్రాల వద్ద పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లావ్యాప్తంగా 17 పరీక్షా కేంద్రాలకు గానూ పట్టణంలో 15, కొత్తకోటలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 4,843 మందికి గానూ 4,007 మంది హాజరు కాగా 836 మంది గైర్హాజరైనట్లు రీజినల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికోన్నత పాఠశాలలోని కేంద్రాలను కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ పరిశీలించారు. మొత్తం 5,234 మందికి గానూ 4,200మంది పరీక్ష రాయగా.. 1,034 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొందరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు వారిని లోపలికి అనుమతించలేదు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రవినాయక్ పర్యవేక్షించారు. అదేవిధంగా జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని అదనపు ఎస్పీ రాములు పర్యవేక్షించారు. మొత్తం 15,199 మందికి గానూ 12,176 మంది పరీక్ష రాయగా 3,023మంది గైర్హాజరయ్యారు.




మహబూబ్‌నగర్‌లో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


గద్వాలలో..


మహబూబ్‌నగర్‌లో ఆలస్యంగా రావడంతో బయటకు పంపుతున్న సెంటర్ సిబ్బంది


వనపర్తిలో విద్యార్థినుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది


మహబూబ్‌నగర్‌లో బ్యాగ్ కౌంటర్

**ఏం కొనేలా లేదు.. ఏం తినేలా లేదు.. ఆకాశమే హద్దుగా పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్యులపై భారం పడుతున్నది. రూ.400 కేజీ ధరలో బీన్స్ బెంబేలెత్తిస్తుండగా.. రూ.250 ధరతో చిక్కుడు చుక్కలనంటుతుండగా.. మిర్చి ఘాటుకు తోడు క్యారెట్, కాకర కేక పెట్టిస్తున్నది. ధరలను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇంత ధరకు మార్కెట్‌లో వెజిటేబుల్స్ లభ్యమవుతున్నా రైతులకు మాత్రం మద్దతు ధర దక్కడం లేదు. ధరలు పెరగడంతో కూరగాయల జోలికి వెళ్లకుండా ఉన్నదాంట్లోనే సర్దుకుంటున్నట్లు మహిళలు పేర్కొంటున్నారు.**


గద్వాల మార్కెట్‌కు వచ్చిన కూరగాయలు

- రోజురోజుకూ మండిపోతున్న వైనం
- బీన్స్ కేజీ రూ.400, చిక్కుడు రూ.250
- ధరలను నియంత్రించడంలో అధికారుల విఫలం
- రైతులకు మాత్రం దక్కని మద్దతు ధర

# వెజిట్రబుల్స్

## కొండెక్కిన కూరగాయల ధరలు

గద్వాల, జూన్ 9 : జిల్లాలో ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితిలో ఉండగా మరో వైపు కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ప్రజలకు కూరగాయల ఘాటు తగలడంతో సామాన్య ప్రజలు వాటిని కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. కూరగాయల ధరలు రోజు రోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయి. మండి పోతున్న ధరలతో ప్రజలు కూరగాయలు కొనాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బీన్స్ ధర కేజీ రూ.400ఉండగా చిక్కుడు రూ.250 కిలోగా ఉంది. బెండకాయ, ఆలు, వంకాయ, బీట్‌రూట్ లాంటి రెగ్యులర్‌గా వినియోగించే కూరగాయల ధరలు సగటున రూ.60 దొరుకుతున్నాయి. కొన్ని రోజుల కిందట ఇవే కూరగాయాలు రూ.40లకు ఇవి లభ్యమయ్యేవి. టమాట గతనెలలో రూ.10నుంచి రూ.20కిలో లభించగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.60కి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కురువకపోవడంతో పంటలు అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో ధరలు మండిపోతున్నాయి. మన ప్రాంతంలో కూరగాయలు సాగు అంతంత మాత్రమే ఉండడం ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో ధరలు ఒక్కసారిగా అమాంతగా పెరిగిపోయాయి. కడప, చిత్తూరు, మదనపల్లి తదితర ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం అక్కడ నుంచి మనకు వచ్చే కూరగాయలు రాకపోవడంతో మార్కెట్‌లో కూరగాయలకు కొరత ఏర్పడడంతో ధరలు ఆకాశాన్ని అంటాయి. మార్కెట్‌లో ఏ కూరగాయలు కొనాలన్నా సరాసరి కేజీ రూ.60పైనే ఉండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధరల నియంత్రణపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ మేరకు దృష్టి సారించక పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ఉద్యానవ శాఖ అధికారులు రైతులకు కూరగాయలు సాగుపై అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఇతర పంటలు వేయడంతో మన ప్రాంతంలో కూరగాయలు సాగు అంతంత మాత్రమే ఉంది. గత నెలల్లో వంకాయ, కాలిఫ్లవర్, క్యాప్సికం, బీరకాయ, క్యారెట్ తదితర కూరగాయలు రూ.40కు కేజీ ఉండగా ప్రస్తుతం అవి కేజీ రూ.80గా విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరుగుతున్న పంట పండించిన రైతులకు మాత్రం ఆ దిశగా ధరలు లేకపోవడంతో మార్కెట్‌లో రైతులు పండించిన కూరగాయలు దళారులకు ధర వచ్చిన కాడికి అమ్ముకొని పోతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో సామాన్యుడు ఏదీ కొని తినలేని పరిస్థితి నెలకొన్నది. వచ్చిన జీతంలో కూరగాయలకు పావలా వంతు వెచ్చించాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నారు. పెరుగుతున్న ధరలను అదుపులో ఉంచి అందరికీ అందుబాటులో కూరగాయల ధరలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనికి తోడు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తే అందులో రైతు లు నేరుగా కూరగాయలు విక్రయించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. దీంతో అటు రైతులు ఇటు కొనుగోలు దారులకు లాభం చేకూరడంతో పాటు కూరగాయల ధరలు కొంత మేర తగ్గే అవకాశం ఉందని వినియోగదారులు అంటున్నారు. ఆదిశగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



### దళారులకే లాభం..

వర్షాలు సరిగా కురువకపోవడంతో కూరగాయల సాగు దెబ్బతిందని చూపించి రైతుల నుంచి వ్యాపారులు, దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి వినియోగదారుల ముక్కు పిండి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీంతో రైతులు మార్కెట్‌లో అమ్ముకోలేక వచ్చిన కాడికి దళారులకు అమ్ముకొని పోతున్నారు. దీంతో రైతులు నష్టపోతుండగా వ్యాపారులు, దళారులు లబ్ధి పొందుతున్నారు.



### కూరగాయల ధరలు

| | | |
|---|---|---|
| క్యాప్సికం | : | రూ.80 |
| వంకాయ | : | రూ.40 |
| కాలిఫ్లవర్ | : | రూ.80 |
| క్యారెట్ | : | రూ.100 |
| కాకర | : | రూ.100 |
| బీరకాయ | : | రూ.100 |
| మిర్చి | : | రూ.120 |
| బెండకాయ | : | రూ.60 |
| టమాట | : | రూ.40 |
| చౌలకాయ | : | రూ.80 |
| దొండకాయ | : | రూ.60 |
| బీట్‌రూట్ | : | రూ.60 |
| దోసకాయ | : | రూ.80 |
| ఉల్లి | : | రూ.25 |
| ఆలు | : | రూ.40 |
| బీన్స్ | : | రూ.400 |
| చిక్కుడు | : | రూ.250 |
| క్యాబేజీ | : | రూ.80 |



### ధరలపై నియంత్రణ ఉండాలి

ప్రస్తుత పరిస్థితిలో మార్కెట్‌లో అన్ని ధరలు పెరిగిపోయాయి. కూరగాయలు కొనుగోలు చేద్దామంటే వాటి ధరలు ఆకాశాన్ని అంటాయి. ప్రస్తుత పరిస్థితిలో పేద, సామాన్య ప్రజలు అటు మార్కెట్‌లో సరుకులు ఇటు కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొన్నది. రూ.100 తీసుకొని మార్కెట్ వెళ్తే ప్రస్తుతం రెండు కేజీల కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు. ధరలపై అధికారులు నియంత్రణ ఉండేలా చూడడంతోపాటు రైతులు కూరగాయల సాగుచేసే విధంగా వారిని ప్రోత్సహించాలి. కూరగాయల సాగుతో లాభాలు ఉంటాయని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తే అప్పుడు ధరలు తగ్గే అవకాశం ఉంది.

**-సుజాత, గృహిణి, అయిజ, జోగుళాంబ గద్వాల జిల్లా**

### ఏంకొని తినలేకుండా..

ఓ వైపు పప్పు, ఆయిల్, ఆకుకూరలు ధరలు పెరిగిపోయాయి. గత వారం రోజులుగా కూరగాయల ధరలు అన్ని రూ.60 పైనే ఉన్నాయి.గతంలో రూ.100 కూరగాయలు తీసుకుంటే ఐదారు రోజులు వచ్చేవి. ప్రస్తుతం రూ.100 పెడితే రెండు రోజులకు సరిపడా కూరగాయలు రావడం లేదు. కూరగాయలు కొనాలంటేనే భయం వేస్తుంది. ప్రస్తుతం ఏమి కొని తినే పరిస్థితుల్లో లేము. పేద, మధ్య తరగతి వారు కూరగాయల జోలికే వెళ్లడం లేదు. ఇంట్లో ఉన్నదానితో సర్దుకుంటున్నాం.. ధరల నియంత్రణపై చర్యలు తీసుకోవాలి.

**- సరోజ, గృహిణి, జమ్మిచేడు, జోగుళాంబ గద్వాల జిల్లా**




శాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

# పురాతన శాసనాలను కాపాడుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

జడ్చర్ల టౌన్, జూన్ 9 : పురాతన జైన శాసనాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆదివారం జడ్చర్ల మున్సిపాలిటీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కావేరమ్మపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో క్రీ.శ. 12వ శతాబ్ది పురాతన శాసనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావేరమ్మపేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న శాసనం క్రీ.శ. 1125వ సంవత్సరం జనవరి21వ తేదీ నాటిదని తెలిపారు. నాటి కళ్యాణి చాళుక్య చక్రవర్తి మూడో సోమేశ్వరుని కుమారుడు కందూరునాడు యువరాజు మూడో తైలపుడు పాలించిన క్రమంలో మూల సంఘానికి చెందిన మేఘచంద్ర భట్టారకుడు వేయించిన శాసనంగా వివరించారు. ఇందులో గంగాపురంలోని పార్శ్వనాథ చైత్య ఆలయ ప్రస్థావన ఉన్నట్లు తెలిపారు. గంగాపూర్ శివారులోని గొల్లత్తగుడి ఇటుక ఆలయం జైన చైత్యాలయమని తెలిపారు. అలాగే వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్రీ.శ. 1162 నాటి కందూరు చోళ వంశానికి చెందిన రెండో ఉదయన చోలుడు, కోడూరు స్వయంభూ సోమేశ్వరనాథుని నిత్య అర్చనలకు 5 గోకర్ణ సింగ రూకలను, గంగాపురం నుంచి వచ్చే ఆదాయాన్ని దానం చేసినట్లుగా శాసనంలో ఉన్నదన్నారు. పురాతన శాసనాలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట అఖిలభారత ప్రాచీన ఆలయ జీర్ణోద్ధరణ ట్రస్ట్ చైర్మన్ ఆర్.కె.జైన్, కోచైర్మన్ ముఖేశ్‌కుమార్‌జైన్, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఎస్ ఆనకట్టపై పారుతున్న వరద

# జూరాలకు వరద రాక

ధరూరు, జూన్ 9 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్ట్‌కు వరద భారీగా చేరుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ఆదివారం 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 1045 అడుగులకుగానూ ప్రస్తుతం 1035.466 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. 4.618 టీఎంసీలకు గానూ 0.911 టీఎంసీలు నిల్వ ఉన్నది.

***ఆర్డీఎస్‌కు 7,952 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో***

అయిజ, జూన్ 9 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ఆదివారం 7,952 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 7,952 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైనట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.9 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.

***తుంగభద్ర డ్యాంకు..***

తుంగభద్ర డ్యాంకు ఆదివారం 2,750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 8 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. డ్యాం 100.855 గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 4.168 టీఎంసీల నిల్వ ఉన్నది. 1633 అడుగులకు గానూ 1,579.36 అడుగులకు చేరినట్లు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# జేఈఈలో ప్రతిభ విజయ దుందుభి

పాలమూరు, జూన్ 9 : ఆదివారం విడుదలైన జేఈఈ 2024 ఫలితాల్లో మహబూబ్‌నగర్‌లోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారు. ఉమ్మడి జిల్లా చరిత్రలోనే తొలిసారిగా ప్రతిభ కళాశాల విద్యార్థి ఎల్.ప్రవీణ్‌కు ఆలిండియా 6వ ర్యాంక్ సాధించాడు. అదేవిధంగా ఆలిండియా కేటగిరీలో బి.శ్రీకాంత్ 226వ ర్యాంక్, ఎం.రాము 256వ ర్యాంక్, ఎం.శివ 328వ ర్యాంక్, వై.శ్రీనిత్య 1200వ ర్యాంక్, వి.చరణ్‌లాల్ 1,747వ ర్యాంక్, కె.సునీల్‌కుమార్ 2,162 ర్యాంక్, పి.సుమంత్ 2,240 ర్యాంక్, ఎ.నవీన్‌కుమార్ 2,868వ ర్యాంక్, బి.అనిరుధ్‌గౌడ్ 3,763వ ర్యాంక్, బి.శ్రీనివాస్ 4,112వ ర్యాంక్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి 4,575వ ర్యాంక్, ఎ.కార్తీక్‌సాగర్ 7,629వ ర్యాంక్, ఎ.గణేశ్ 7,876వ ర్యాంక్ సాధించారు. కళాశాల ప్రారంభించినప్పటి నుంచి 18 ఏండ్లుగా ఐపీఈ, ఎంసెట్‌తోపాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్‌లో నిష్ణాతులైన అధ్యాపకులతో ఉత్తమ విద్యను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ ప్రతిభ కళాశాల. అదేవిధంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రోత్సహిస్తూ, మానసికంగా సంసిద్ధులను చేస్తూ వారికి కూడా దేశంలోని పలు ఐఐటీ, నీట్ ఇంజినీరింగ్‌లో సీట్లు, నీట్ (యూజీ)లో మెడికల్ సీట్లు వచ్చేలా విద్యనందిస్తున్నది. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కె.మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్దన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

# జేఈఈలో రిషి విజయకేతనం

పాలమూరు, జూన్ 9 : జేఈఈ 2024 ఫలితాల్లో మహబూబ్‌నగర్‌లోని రిషి ఐఐటీ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారని అకాడమీ కరస్పాండెంట్ చంద్రకళా వెంకట్, సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో ఎస్టీ విభాగంలో యువజరాజ్‌నాయక్ ఆలిండియా 805వ ర్యాంక్, జోయల్‌కుమార్ ఎస్సీ విభాగంలో 1,251వ ర్యాంక్, కౌశిక్‌యాదవ్ ఓబీసీ కేటగిరీలో 4,461వ ర్యాంక్, వంశీచంద్ర బీసీబీ కేటగిరీలో 8,204వ ర్యాంక్, సాయి ప్రతీక్ష ఎస్సీ కేటగిరీలో 7,950వ ర్యాంక్, సాకేత్‌సింగ్ జనరల్ కేటగిరీలో 14,741వ ర్యాంక్ సాధించి జిల్లాకు గుర్తింపు తెచ్చారని అకాడమీ యాజమాన్యం తెలిపింది. పోటీ పరీక్షల కోసం అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణనిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్

